క్లుప్తంగా

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ పరిశీలకుడు వెంకటేశ్వర్లు సమక్షంలో శుక్రవారం లెక్కింపు చేపట్టారు. ఈనేపథ్యాన రూ.28,809 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నల్లమోతు లక్ష్మయ్య తెలిపారు. ఈ లెక్కింపులో బాచిమంచి పుల్లయ్యశర్మ, సిబ్బంది వరప్రసాద్, తోటకూరి సత్యనారాయణ, శ్రీనివాసరావు, శంకరయ్య పాల్గొన్నారు.

ఆర్‌వైవీ దరఖాస్తుల పరిశీలనపై ఆరా

తిరుమలాయపాలెం: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2నుంచి ప్రారంభించనున్న రాజీవ్ యువ వికాసం పథకం కోసం అందిన దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ సూచించారు. తిరుమలాయపాలెం ఎంపీడీఓ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆమె కేటగిరీల వారీగా అందిన దరఖాస్తులు, పరిశీలనపై ఆరా తీసి ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, ఇంకుడు గుంతల నిర్మాణం వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఉద్యోగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ



చిత్తలూరి నర్సయ్యను పరామర్శిస్తున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం నగరంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. 27వ డివిజన్‌లో ఇటీవల మరణించిన చింతల ప్రసాద్ కుటుంబాన్ని, ఇటీవల శస్త్ర చికిత్సలు చేయించుకున్న చిత్తలూరి నర్సయ్యను, ఎర్రా అప్పారావు సతీమణి కృష్ణవేణిని, అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చికిత్స చేయించుకున్న మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ తదితరులను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు ఉన్నారు.

విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి



నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. శుక్రవారం నగరంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బోదన్‌లో ప్రమాదవశాత్తు మరణించిన విద్యుత్ ఉద్యోగి మహేందర్‌కు నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖలో అధికారులు, ఉద్యోగులు భద్రతా చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సంస్థలో పనిచేసే కార్మికులు, వినియోగదారులు, ప్రజలను చైతన్య పర్చాలని, విధులు నిర్వహించే సమయాన నిర్దేశించిన సూత్రాలను పాటించాలని తెలిపారు. హెల్మెట్ ధరించటం, లైన్ క్లియర్, ఎర్త్ చేసుకోవడం వంటివి తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సివిల్ ఇంజనీర్ జి.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అకౌంట్స్ అధికారి కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
ఆదిత్య	యమదొంగ
శ్రీనివాస	ఎలెవన్, దేశముదురు

- ఖమ్మంగాంధీచౌక్

అంధకారంలో ఏదులాపురం..



బారుగూడెంలో వీధిదీపాలు లేని ఓ వీధి

వీధి దీపాలు.. నిర్వహణ లోపాలు

- చిమ్మచీకట్లో మున్సిపల్ వార్డులు
- మూడు నెలలుగా వెలగని లైట్లు
- రాత్రయితే బయటకు వెళ్లలేని దుస్థితి
- పట్టించుకోని అధికారులు

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు గత మూడు నెలలుగా అంధకారంలో మగ్గుతున్నాయి. వీధిలైట్లు వెలగక ఆయా వార్డుల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏ వీధిలోనైనా లైట్ పోయిందా ఇక అంతే సంగతి.. ఆ లైట్ వేసేదెప్పుడో తెలియని దుస్థితి నెలకొంది. దీంతో వార్డుల ప్రజలు చిమ్మచీకట్లోనే జీవనం గడపాల్సి వస్తోంది.

అభివృద్ధిపై గంపెడాశలు..

ఈ ఏడాది ఫిబ్రవరి 6 నుంచి కొత్తగా ఏదులాపురం మున్సిపాలిటీ పాలన మొదలైన సంగతి విదితమే. మున్సిపాలిటీ ఏర్పడితే గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పటికి కంటే పరిస్థితి మెరుగ్గా ఉంటుందని, తమ కష్టాలన్నీ కడతేరుతాయని భావించిన ప్రజల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి. పాలన మొదలై నాలుగు నెలలు గడుస్తున్నా.. మున్సిపల్ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రధానంగా ప్రజల కనీస అవసరాలైన వీధిలైట్లు వేయలేని పరిస్థితిలో ఉందంటే పాలన ఏ రీతిలో సాగుతుందే ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇంతకంటే గ్రామ పంచాయతీ పాలనే బాగుంది కదా అనే ఆరోపణలు రావడం గమనార్హం.

మూడు నెలలుగా చీకట్లోనే..

ఇదిలా ఉండగా గత మూడు నెలలుగా మున్సిపల్ పరిధిలోని 12 గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. గుదిమళ్ల, పెదతండా, గుర్రాలపాడు, ఏదులాపురం, వెంకటగిరి, రాజీవ్‌గృహకల్ప, రెడ్డిపల్లి, ముత్తగూడెం, గొల్లగూడెం, బారుగూడెం తదితర ప్రాంతాల్లోని వీధుల్లో లైట్లు వెలగక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో బయటకు వెళ్లాలంటేనే పురుగు, పుట్రా భయంతో వెళ్లలేకపోతున్నారు.

లైట్లు ఏర్పాటు చేయిస్తున్నాం..

మున్సిపాలిటీ పరిధిలో అక్కడక్కడా వీధి లైట్లు వెలగడం లేదు. ఎక్కడైతే లైట్లు రావడం లేదో తక్షణమే మున్సిపల్ సిబ్బందిచే కొత్త లైట్లు ఏర్పాటు చేయిస్తున్నాం. మున్సిపల్‌లో ఏ సమస్యనైనా నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చు లేదా కార్యాలయంలో సంప్రదించవచ్చు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నాం.

– ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కమిషనర్, ఏదులాపురం

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలి



కోనాయిగూడెంలో ప్రచారం చేస్తున్న ఎంఈఓ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు సూచించారు. మండలంలోని కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించి పాఠశాల ద్వారా అందించే సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత రెండుళ్లుగా నూరు శాతం ఫలితాలు సాధిస్తుందని, కార్పొరేట్‌స్థాయిలో ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు సమష్టి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోనాయిగూడెం, ఆచార్లగూడెంకు చెందిన విద్యార్థులు ఆరెగూడెం పాఠశాలకు వచ్చేందుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో ఆటో సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బస్వోశేషరావు, బి.వెంకన్న, షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 22న ఖమ్మం నిర్వహించే తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభ కరపత్రాలను శుక్రవారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తంబూరి దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం నిర్వహిస్తున్న మహాసభ కార్యక్రమాలు సంఘ బాధ్యుల అంకిత భావాన్ని చాటి చెబుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్, జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ జానీమియా, వ్యవస్థాపకుడు షేక్ నజీరుద్దీన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ హసన్, సంఘ జిల్లా నాయకులు అఫ్జల్‌మియా, మన్సూర్ అలీ, ఇస్సాక్ పాషా, సుల్తాన్ బాబా, నాగుల్ మీరా, సోందుమియా, అహ్మద్, ఆశ, చాంద్ పాషా, ఖాసీం, అమీర్, జానీ, షాజహాన్, ఇమామ్, సైదా, ఖలీల్, మహిమూద్, యాసీన్, రహీం, హమీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికల్లో మర్రి ప్రకాష్‌ను గెలిపించాలి

ఖమ్మంలీగల్: త్వరలో జరగబోయే తెలంగాణ స్టేట్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయనున్న సీనియర్ అడ్వకేట్ మర్రి ప్రకాష్‌ను అత్యధిక మెజారిటీ గెలిపించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి కోరారు. ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రకాశ్‌కు మద్దతుగా ఖమ్మం కోర్టు ప్రాంగణంలో పోస్టర్లు ఆవిష్కరించాక మాట్లాడారు. దళిత, బహుజన న్యాయవాదులంతా మద్దతు తెలిపి స్టేట్ బార్ అసోసియేషన్‌లో మాలల గొంతుక వినిపించాలని కోరారు. నేటి ఆధునిక సమాజంలోనూ దళిత బహుజనులు అన్ని రంగాల్లో అణచివేతకు గురవుతూనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైట్ చాయిస్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ మెండెం కిరణ్‌కుమార్, వైబ్రెట్ ఆఫ్ కలాం అధ్యక్షుడు విజయ్ కలాం, ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల ఆనంద్, బార్ కౌన్సిల్ అభ్యర్థి మర్రి ప్రకాష్, మాలమహానాడు నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమసమాజ మార్గదర్శకుడు మారోజు వీరన్న

ఖమ్మం మామిళ్లగూడెం: తన నూతన ఆలోచనల మేరకు భారతదేశంలో సమ సమాజం కోసం మార్గదర్శకత్వం వహించిన అమరుడు మారోజు వీరన్న అని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి కొనియాడారు. శుక్రవారం మారోజు వీరన్న 26వ వర్ధంతి సభను ఖమ్మంలో నిర్వహించగా.. ఆమె పాల్గొని వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. విప్లవోద్యమాలలో నూతన వరవడి, లాల్ నీల్ స్నేహ సంబంధాల్లో మార్పులు ఆయన ద్వారానే వచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయ, జిల్లా అధికార ప్రతినిధి త్రివేణి, గౌరవ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి ప్రమీల, జాయింట్ సెక్రటరీ సరోజిని, సలహాదారులు వీరన్ననాయక్, రవీందర్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రూనాయక్‌లతో పాటు మారోజు వీరన్న కుటుంబీకులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థలో ట్యాంక్..



మండలంలోని మంగాపురతండాలో గత 20 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ పిల్లర్లు పెచ్చులూడి పడేందుకు సిద్ధంగా ఉంది. గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కులేదని వాపోతున్నారు. ప్రమాదం జరిగే వరకూ అధికారులు కదిలే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ పట్ల అప్రమత్తం కావాలని స్థానికులు కోరుతున్నారు.

– నేలకొండపల్లి

కేఎంసీ సమాచారం..

మాతృస్థానానికి కేఎంసీ ఏఓ శివలింగం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న కె.శివలింగం డిప్యూటేషన్‌ను రద్దు చేసి మాతృస్థానం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఏఓగా తిరిగి పంపిస్తూ సీడీఎంఏ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ఇల్లెందు మున్సిపాలిటీలో డిప్యూటేషన్‌పై ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.శ్రీనివాసరెడ్డి డిప్యూటేషన్‌ను రద్దు చేసి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఏఓగా తిరిగి పంపిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఇల్లెందు మున్సిపల్ ఏఓగా ఎవరినీ కేటాయించలేదు.

కేఎంసీ ఏఈగా ఎస్‌డీ.షమ..

ఖమ్మం నగర పాలక సంస్థ ఏఈగా ఎస్‌డీ.షమ శుక్రవారం కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు. మహబూబాబాద్ మున్సిపల్ నుంచి కేఎంసీకి బదిలీపై వచ్చిన ఆయన కమిషనర్‌ను కలిసిన అనంతరం ఈఈ కృష్ణలాల్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇద్దరు ఏఈలు, తాజాగా మరో ఏఈ కేఎంసీకి రావడంతో ఇంజనీరింగ్ విభాగంలో అధికారుల కొరత తీరినట్లైంది.

నాలుగు లక్షల మొక్కలు నాటాలి..

2025–26 ఏడాది వనమహోత్సవంలో భాగంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 4 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఉద్యాన అధికారిణి బి.రాధిక తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో గార్డెన్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించిన ఆమె వనమహోత్సవంపై పలు సూచనలు చేశారు. నగరంలో మొక్కలు నాటేందుకు వీలున్న ప్రదేశాలను గుర్తించాలని, నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో హరితవనాల విస్తీర్ణం చేపట్టాలని సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రతినిధులు

నేలకొండపల్లి: రాజ్యాంగ పరిరక్షణ కమిటీని మండల కేంద్రంలోని మసీద్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా అబ్దుల్ సత్తార్, ఉపాధ్యక్షుడిగా రహీం, కార్యదర్శిగా రసూల్, సహాయ కార్యదర్శిగా షేక్ సలాం, కోశాధికారిగా షేక్ ఖలీద్, గౌరవ సలహాదారుడిగా ఖాదర్ బాబా, కార్యవర్గ సభ్యులుగా షేక్ రఫీ, సొందుమియా, నాగుల్ పాషా, హయిమ్, ఇమామ్, హుస్సేన్, అన్వర్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రాజ్యాంగ పరిరక్షణ కమిటీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాధిక్ అలీ, పాలేరు నియోజకవర్గం అధ్యక్షుడు నజీర్, మండల అధ్యక్షుడు సుభాన్, మసీద్ కమిటీ అధ్యక్షుడు మైబువలీ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

ఖమ్మంక్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలోగల ఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం మృతిచెందిన గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. మృతుడు బట్టుపల్లి బుచ్చిబాబు(62) ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడు కొంతకాలంగా మద్యానికి బానిస కాగా మృతి చెందిన నాడు కూడా మద్యం సేవించి ఉండడంతో వడదెబ్బకు గురై మృతిచెందాడని తెలిపారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరి కొయ్యలను తగలబెట్టొద్దు



జుజుల్‌రావుపేటలో పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ

కూసుమంచి: వరి కోతలు పూర్తయిన తరువాత చాలామంది రైతులు వరి కొయ్యలను కాల్చుతున్నారని, అది సరికాదని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి కొయ్యలను తగలబెట్టిన పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. గురువారం పాలేరులో వరి కొయ్యలు తగలబడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లగా నష్టంపై ఆరా తీశారు. వరి అవశేషాలను కాల్చితే వాతావరణం కాలుష్యం కావడంతో పాటు పంటలకు మేలు చేసే సూక్ష్మక్రిములు నశిస్తాయని, తద్వారా పంటలకు కూడా నష్టం వాటిల్లుతుందన్నారు. ఎప్పుడైన అవశేషాలను భూమిలోనే కలియదున్నడం వలన అనేక లాభాలు ఉన్నాయని, భూమిలో సాంద్రత పెరిగి మొక్కలకు పోషకాలు అందుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఏఈఓలు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా

ఖమ్మంరూరల్: రాబోయే సంస్థాగత ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధమవ్వాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన రూరల్ మండల సమావేశంలో వారు మాట్లాడారు. రూరల్‌లో సీపీఐకి మొదటి నుంచి పట్టు ఉందని, గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ముందుండాలని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పని చేస్తూ.. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు నిరంతర పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం తమ స్వార్థ రాజకీయమే లక్ష్యంగా మత విద్వేషాలు రెచ్చగొడుతోందని ఆరోపించారు. అదే విధంగా మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి, రిటైనింగ్ వాల్, తాళ్లేసేతండా వద్ద ఇళ్లు, భూములు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి ప్రత్యామ్నాయం, నష్టపరిహారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వెన్నం భాస్కర్, మిడకంటి చినవెంకటరెడ్డి, సిద్దినేని కర్ణకుమార్, పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరంగ యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

నేలకొండపల్లి: ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యాన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగ యాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైన్యానికి అభినందనలు తెలిపే తిరంగ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సైనికుల పోరాట పటిమను కీర్తిస్తూ సాగే ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వెంటనే కొనుగోలు శరవేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ఉపాధ్యక్షుడు కాళంగి వెంకటేశ్వర్లు, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



మంత్రికి బొకే అందిస్తున్న కొరిపల్లి శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: మూడు దశాబ్దాల దండోరా ఉద్యమ ఫలితంగానే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ ఏ,బీ,సీలుగా వర్గీకరించి చట్టబద్ధత కలిగిందని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కొరిపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుపేద దళిత కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఉప కులాల జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవరపు డేవిడ్‌రాజు, చర్మకారుల సంఘం అధ్యక్షురాలు ఇటుకల లత, మాదిగ జేఏసీ జిలా అధ్యక్షుడు విజయకుమార్, గౌతమ్, శ్రీనివాస్, నాగరాజు మాదిగ, సత్యనారాయణ, జంగం వెంకయ్య, నాగరాజు, రవిబాబు, నవీన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రురాలిని ఆస్పత్రిలో చేర్పించి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారు. మండల కేంద్రానికి చెందిన టి.పద్మ శుక్రవారం కొత్తకొత్తూరు నుంచి నేలకొండపల్లి నడిచి వెళ్తోంది. అదే సమయాన బైక్‌పై వస్తున్నయువకులు ఆమెను ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. ఆతర్వాత మహిళను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి అక్కడ నుంచి జారుకున్నారు. స్థానికులు వారి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు.

రైతన్న బిజీబిజీగా..

ఓ వైపు పంట కోత.. మరోవైపు సాగుకు దుక్కులు



తాళ్లచెరువులో మిర్చి తోటను సేకరిస్తున్న కూలీలు

ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతన్న మండుటెండల్లోనూ కష్టాలు తప్పడం లేదు. గత సీజన్‌లో పండించిన పంటలను సేకరించే పనిలో కొందరు రైతులు ఉండగా.. మరికొందరు ఖరీఫ్ సీజన్‌కు పెంట తోలకాలు, దుక్కులను సిద్ధం చేసుకోవడం, ధాన్యం అమ్మేందుకు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు తొందరగానే వస్తాయనే వాతావరణశాఖ అధికారులు ప్రకటనలతో నిత్యం వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతూ తీరికలేకుండా కష్టాలు పడుతున్నారు. పాలకులు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – తిరుమలాయపాలెం



రమణాతండాలో దుక్కుల్లో పెంట తోలకాలు..



పిండిప్రోలులో దుక్కులు సిద్ధం చేస్తున్న ట్రాక్టర్